సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



కొత్త ఫ్యాక్టరీ నిర్మిస్తాం
అశ్వారావుపేటలో మరో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి తెలిపారు. 8లో



అక్రమాల అధికారి
మణుగూరులోని బీటీపీఎస్‌లో ఓ అధికారి కమీషన్ల కక్కుర్తితో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 31° / 24°
జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతంగా మారే అవకాశం ఉంది.

బంధాలను పెంచే బతుకమ్మ


బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతున్న మహిళలు

పూల పండుగకు ఎల్లలు దాటి వస్తున్న మహిళలు

- బంధుత్వం, స్నేహానికి ప్రాధాన్యత
- కలిసికట్టుగా ఆటపాటలతో వేడుకలు
- మగువల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే అతి పెద్ద పండుగ, మహిళల ప్రత్యేక పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను పూలతో పేర్చి ఆటపాటలతో సాగే సంబురాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. సాగనంపే సద్దుల బతుకమ్మను పోయిరావమ్మ, మళ్లీ రావమ్మా అంటూ ఊరూ వాడ అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. సోమవారం జరుపుకునే సద్దుల బతుకమ్మకు ఇళ్లన్నీ మహిళలతో కళకళలాడుతున్నాయి. బతుకమ్మ వేడుకలను పుట్టింట్లో జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. కొందరు ఏ ప్రాంతంలో ఉన్నా, పొరుగు రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉన్నా బతుకమ్మ పండుగ కోసం పుట్టింటికి వచ్చి వేడుకలు నిర్వహిస్తుంటారు. పుట్టి పెరిగిన ఊరు, కలిసి చదువుకున్న స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడపడానికి మహిళలు ప్రాధాన్యత ఇస్తారు. పుట్టింటి వారే గాక పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చిన కోడళ్లు సైతం అత్తవారి ఇంట్లోనే ఉండి బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఏ పండుగకు తల్లిగారింటికి వెళ్లినా బతుకమ్మ పండుగకు మాత్రం అత్తవారి ఇంట్లో ఉండి పూల పండగను జరుపుకోవాలని భావిస్తున్నారు. స్నేహితులు, బంధువులతో కలిసి పరిసర ప్రాంతాల్లో, పచ్చిక బయళ్లలో పూలు కోసుకువచ్చి బతుకమ్మలను పేర్చుతారు. ప్రతి రోజు సాయంత్రం అందమైన దుస్తులు, పట్టు వస్త్రాలు ధరించి బతుకమ్మలను మోస్తూ బ్యాండ్ మేళాలు, డీజే సౌండ్స్, కోలాటాలతో పాటలు పాడుతూ, ఆటలాడుతూ సమీప దేవాలయాలు, జలాశయాల వద్దకు చేరుకొని గౌరమ్మను పూజిస్తూ బతుకమ్మ పాటలతో సంబురాలు జరుపుకుంటున్నారు. సోమవారం జరుపుకునే సద్దుల బతుకమ్మ కోసం విదేశాలు, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు మహిళల అభిప్రాయాలతో ప్రత్యేక కథనం..

పుట్టింట్లో జరుపుకోవడమే ఇష్టం



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చెన్నైలో పనిచేస్తున్నా. బతుకమ్మ వేడుకలను పుట్టింట్లో జరుపుకోవటం ఎంతో ఇష్టం. పూలను స్వయంగా సమీకరించి, అందంగా పేర్చటం కూడా బాగా ఇష్టం. పూల పండుగ ఆనందాలను పంచుతుంది. స్నేహితులమంతా కలుస్తాం. ఆటపాటలు, కబుర్లు చెప్పుకుంటాం. ఈ పండుగతో అందరినీ కలిసే అవకాశం ఉంటుంది.
– బిద్దె భావనశ్రీ, భద్రాచలం

వేడుకలు ప్రత్యేకం



బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నా. ప్రతి ఏడాది బతుకమ్మ పండుగకు తప్పకుండా ఇంటికి వస్తా. మహిళలకు ఈ బతుకమ్మ వేడుక ఓ ప్రత్యేకం. ఈ పండుగకు స్నేహితులమంతా కలుసుకుంటాం. కుటుంబ సభ్యులమంతా సరదాలు చేస్తాం. ఆటపాటలతో సంతోషాలు పంచుకుంటాం. ఈ పండుగకు పట్టు వస్త్రాలు ధరించి మురిసిపోతాం.
– తేజోప్రియ, విద్యానగర్ కాలనీ, కొత్తగూడెం

సంస్కృతికి ప్రతీక...



ఉద్యోగ రీత్యా అమెరికా డల్లాస్, టెక్సాస్‌లో ఉంటున్నాం. పూల పండుగ బతుకమ్మ అంటే ఇష్టం. బతుకమ్మ, దసరాతో పాటు కుటుంబం, స్నేహితులతో కొద్ది రోజులు గడిపి వెళ్లడానికి వచ్చాం. బతుకమ్మను రకరకాల పూలతో పేర్చి తీసుకువెళ్లి బంధువులు, స్నేహితులతో ఆటపాటలతో గడపటం ఆనందంగా ఉంటుంది. ఇవి మరపురాని జ్ఞాపకాలు.
– బాలిని శ్రావ్య, మోతీనగర్, ఖమ్మం

ఇది ప్రకృతి పండుగ..



వృత్తి రీత్యా ఐటీ ప్రొఫెషనల్. చెన్నైలో కుటుంబంతో ఉంటున్నాం. నాన్న ఖమ్మంలోని అయ్యప్ప ఆలయంలో ప్రధాన పూజారి. ప్రతి బతుకమ్మ వేడుకకు ఖమ్మం వస్తా. ప్రకృతి ప్రసాదించిన పూలతో బతుకమ్మను పేర్చి పూజలు చేయటం మంచి సంస్కృతి. పూలను బతుకమ్మగా పేర్చి ఆటపాటలతో మహిళలు సంబురాలు చేసుకోవటం ఓ అనుభూతి. నేను కూడా ఈ వేడుకల్లో పాల్గొంటా. ఇక్కడ స్నేహితులతో ఉత్సవాల్లో ఆనందాలు పంచుకుంటాం.
– నమిత, దాబాలబజార్, ఖమ్మం

మరుపురాని ఆనందం



మా ఊరు ఏపీలోని రాజమండ్రి. మాకు అశ్వారావుపేటలో బంధువులు ఉన్నారు. బతుకమ్మ వేడుకలకు తప్పకుండా ఇక్కడకు వస్తాం. బతుకమ్మ పండుగ బంధాలను పెంచుతుంది. ఈ సంస్కృతి ఎంతో గొప్పది. మహిళలు పూలను పూజించటం ఓ మంచి సంప్రదాయం. ఈ వేడుక జరుపుకోవడం మరుపురాని ఆనందాలను ఇస్తుంది.
-ఎం.తేజస్య, రాజమండ్రి, ఏపీ రాష్ట్రం

ఏటా తప్పకవస్తాం



చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. ఖమ్మంలో అమ్మవారి ఇంటికి బతుకమ్మ వేడుకలకు రావటం ఆనందంగా ఉంది. ప్రతి ఏటా వస్తుంటాం. బతుకమ్మ పండుగ మహిళల గౌరవాన్ని పెంచుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ఈ పండుగకు ఆదరణ బాగా పెరిగింది. ఖమ్మంలో ఈ వేడుకకు గుర్తింపు పెరగడం ఆనందంగా ఉంది.
– హరి నిహారిక, రోటరీనగర్, ఖమ్మం

పండుగ వేళ ప్రయాణ పాట్లు

- కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు రెండే రైళ్లు
- దసరా రాకపోకలతో కిటకిటలాడుతున్న వైనం
- బోగీలను పెంచాలని కోరుతున్న ప్రయాణికులు


భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్

కొత్తగూడెంఅర్బన్: దసరా పండుగ సమీపిస్తుండటంతో ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. రైళ్లు, ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి. కానీ రైల్వేశాఖ ప్రయాణికుల రద్దీకి తగినట్లు ఏర్పాట్లు చేయలేదు. భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్(కొత్తగూడెం) నుంచి అత్యధికంగా ఆదాయం గడిస్తున్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వరకు తెల్లవారుజామున నడిచే కాకతీయ రైలు, రాత్రి నడిచే మణుగూరు ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు నడిచే సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పండుగ వేళ ప్రయాణికుల రద్దీ నెలకొంటోంది. వీటితోపాటు మధ్యాహ్నం కొత్తగూడెం నుంచి విజయవాడకు మరో రైలు నడిపిస్తున్నారు. రైళ్లలో రిజర్వేషన్లు సైతం పండుగ తర్వాత వరకు కూడా బిజీ షెడ్యూల్‌తో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పండుగలకు సొంతూరికి వెళ్లే ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. కరోనా కంటే ముందు రద్దు చేసిన రైళ్లను కూడా పునరుద్ధరించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. సింగరేణి రైలుకు బదులుగా నడుపుతున్న పుష్‌పుల్ రైలులో సామగ్రి పెట్టుకునే వీలులేదు. బాత్‌రూంల నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో దసరా తర్వాత కనీసం వారంరోజుల వరకు అదనపు బోగీలను ఏర్పాటు చేయాలని, రైళ్లలో స్వచ్ఛత పాటించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రద్దయిన రైళ్ల కోసం ఎదురుచూపులు

కొత్తగూడెం నుంచి కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్ల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. పండుగ సమయంలోనైనా పునఃప్రారంభించాలని, కాకతీయ రైలుకు పాత పద్ధతిలో అదనపు బోగీలు, స్లీపర్ కోచ్‌తో పాటు ఏసీ బోగీలు ఏర్పాటు చేయాలని, బెల్గావి రైలును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. వీటిపై గత జూలైలో హైదరాబాద్‌లో జరిగిన డీఆర్‌యూసీసీ సమావేశంలో రైల్వే అధికారులు ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేరలేదు.

నత్తనడకన అమృత్ పథకం పనులు

రైల్వే స్టేషన్‌లో అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. స్టేషన్‌లో వెయిటింగ్ హాల్ ఒక్కటీ పూర్తికాలేదు. దీంతో ప్రయాణికులు స్టేషన్‌లో ఇబ్బందులు పడుతున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వేకు భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి బొగ్గు రవాణా ద్వారానే ఏటా రూ.650 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. అయినా రైల్వే అధికారులు ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించడంలేదు.

గతంలో ఏడు రైళ్లు

గతంలో కొత్తగూడెం స్టేషన్ నుంచి ఏడు రైళ్లు రాకపోకలు సాగించేవి. సింగరేణి ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్, కాజీపేట ప్యాసింజర్, కాకతీయ ప్యాసింజర్, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, మణుగూరు సూపర్‌ఫాస్ట్ సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం మణుగూరు సూపర్‌ఫాస్ట్, సింగరేణి ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఎక్స్‌ప్రెస్, విజయవాడ రైలు మాత్రమే నడుస్తున్నాయి. బెల్గావి రైలును గతేడాది రద్దు చేశారు. ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా రైళ్ల సంఖ్య పెంచాలని పలువురు కోరుతున్నారు.

ఏడో రోజుకు చేరిన దీక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూసమస్యపై రామన్నగూడెం ఆదివాసీలు కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో చేస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం 7వ రోజుకు చేరుకున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో అశ్వారావుపేట తహసీల్దార్ రామకృష్ణ ఆదివారం ధర్నాచౌక్ వద్ద దీక్షా శిబిరం వద్దకు వచ్చి ఆదివాసీలతో మాట్లాడారు. రామన్నగూడెం భూసమస్య పరిష్కారం కోసం అక్టోబర్ 6వ తేదీ నుంచి రెవెన్యూ, అటవీశాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహిస్తామని, నిరవధిక నిరాహార దీక్ష విరమించాలని కోరారు. కలెక్టర్ నుంచి జాయింట్ సర్వే నిర్వహించనున్నట్లు ఆర్డర్ కాపీ ఇస్తే తాము దీక్షను విరమిస్తామని చెప్పి ఆదివాసీలు దీక్షను కొనసాగిస్తున్నారు. సోమవారం ఆర్డర్ కాపీ ఇస్తామని తహసీల్దార్ చెప్పారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి మడకం నాగేశ్వరరావు తెలిపారు.

న్యూస్‌రీల్

సింగరేణిలో నలుగురు జీఎంల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న ఈఅండ్‌ఎం జీఎంలను బదిలీ చేస్తూ ఆదివారం కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్‌ఓడీ ఏజీ మురళీధర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారిలో సోమయాజుల వీ.రామమూర్తి, కొండారెడ్డి శ్రీనివాసులు, మాదాల నర్సింహారావు, ఎం.మదన్‌మోహన్ ఉన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని పీఓ పేర్కొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ దరఖాస్తులను కలెక్టరేట్ ఇన్‌వార్డులో అందించి రశీదులు పొందవచ్చని, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తామని వివరించారు.

గ్రూప్‌-1 ఉద్యోగిగా ప్రమోద్‌సాయి


మెడికల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియామక పత్రం అందుకుంటున్న తాటి ప్రమోద్‌సాయి

దమ్మపేట: మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామానికి చెందిన, గ్రూప్‌-1 అభ్యర్థి, తాటి ప్రమోద్‌సాయి శనివారం రాత్రి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మెడికల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియామక పత్రం అందుకున్నారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ హెచ్‌ఓడీ రవీంద్రనాయక్ నియామక పత్రం అందించారు. నెల రోజులపాటు శిక్షణా కార్యక్రమం అనంతరం విధుల్లో చేరనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు నాయకులు ప్రమోద్‌ను అభినందించారు.

విజేతలుగా నిలవాలని..

- భక్తులకు విజయలక్ష్మి అమ్మవారి దీవెనలు
- నేడు ఐశ్వర్య లక్ష్మిగా అమ్మవారు


విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: జ్ఞానం ద్వారా విజేతలుగా నిలవాలని, విజయోస్తు అంటూ విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులను దీవెనలు అందించారు. భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం లక్ష్మీతాయారు అమ్మవారు విజయలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు సుందరకాండ పారాయణం చేశారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం తెల్లవారుజామున అభిషేకం జరిపారు. గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, సువర్ణ పుష్పార్చన చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం గావించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. దసరా సెలవులు, ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

నేటి ఐశ్వర్యలక్ష్మి అలంకార విశిష్టత

'అస్యేశానా జగతో విష్ణుపత్నీ' అని కీర్తిస్తుంది.. యజుర్వేదం. ఐశ్వర్యం అంటే శాఖాపరమైన శక్తి సామర్థ్యాలని, అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకరాలు, కరుణారూపిణి అయిన ఈ అమ్మ శ్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహావిష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటాడని శ్రీ పరాశరభట్టార్ కీర్తించారు. ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే శాసకత్వం, వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: రామాలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం విజయవాడలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన వీర్నాల శ్రీమన్నారాయణ రూ.74,400 వేల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పీఆర్వో సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు

- జిల్లాలో 471 జీపీలు, 4,168 వార్డులు
- అధికంగా ఎస్టీలకు 460 సర్పంచ్ స్థానాలు


విద్యానగర్ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: జిల్లాలోని 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ, 22 ఎంపీపీ స్థానాలకు అధికారులు శనివారం రిజర్వేషన్లు ప్రకటించారు. ఇదే క్రమంలో ఆదివారం జిల్లాలోని 471 పంచాయతీల సర్పంచ్ అభ్యర్థులకు, 4,168 వార్డులకు సైతం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసి వెల్లడించారు. 471 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు గాను 235 చోట్ల ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ చేయగా, మరో 225 స్థానాలను ఎస్టీ మహిళలకు కేటాయించారు. ఇక ఎస్సీలకు జనరల్‌లో రెండు స్థానాలు కేటాయించగా, బీసీ జనరల్‌కు నాలుగు స్థానాలు, బీసీ మహిళకు మరో రెండు స్థానాలను, జనరల్ అభ్యర్థులకు మూడు స్థానాలను కేటాయిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఇక గ్రామ పంచాయతీల పరిధిలోని 4,168 వార్డులకు గాను ఎస్టీ జనరల్‌కు 1,396 కేటాయించగా, ఎస్టీ మహిళలకు 1,257 వార్డులను రిజర్వేషన్‌లో అవకాశం కల్పించారు. ఎస్సీ జనరల్‌కు 11, ఎస్సీ మహిళకు 7, బీసీ జనరల్‌కు 19, బీసీ మహిళకు 23 చొప్పున రిజర్వేషన్‌లో వెసులుబాటు కల్పించారు. జనరల్ స్థానాల్లో 789 వార్డులు కేటాయించగా, అదే జనరల్‌లో మరో 666 వార్డులను మహిళలకు అవకాశం కల్పించారు. గడిచిన నాలుగు రోజులుగా గ్రామ పంచాయతీల వారీగా పంచాయతీ అధికారులు తీవ్రస్థాయిలో ఈ రిజర్వేషన్ల కేటాయింపుపై తీవ్ర కసరత్తు చేశారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాబితాలను రూపొందించి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అనుమతితో రిజర్వేషన్లను ప్రకటించారు.

కదంతొక్కిన ఆదివాసీలు

- ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలి
- ధర్మయుద్ధ సభలో ఆదివాసీ సంఘాల నాయకులు
- భద్రాచలంలో ఆదివాసీ సంప్రదాయ సందడి


సభకు హాజరైన ఆదివాసీలు

భద్రాచలం: ఆదివాసీలు కదం తొక్కారు. రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడాలు, బంజారాలను తొలగించే వరకు ధర్మయుద్ధం ఆగదని నినదించారు. ఫలితం వచ్చేవరకూ న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎస్టీ జాబితాలో ఉన్న బంజారాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి ఆదివాసీలు ఆదివారం భద్రాచలం తరలివచ్చారు. సంప్రదాయ పాటలు, నృత్యాలతో అలరించారు. సారపాక బ్రిడ్జి, కూనవరం, చర్ల రోడ్ల నుంచి ర్యాలీలు నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో, పాత మార్కెట్ సెంటర్‌లో ఆదివాసీ వీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన మహాసభకు తరలివెళ్లారు.

అన్నింటా అన్యాయమే..

లంబాడాలను ఎస్టీ జాబితాలో కలపటం వల్ల ఆదివాసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతోందని ఆదివాసీ రాజకీయ, కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్మయుద్ధం పేరిట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1971లో ఆదివాసీలు 2,85,226 మంది, లంబాడాలు 1,32,464 మంది ఉండగా, 1981లో ఆదివాసీల సంఖ్య, 3,59,799కు, లంబాడాల సంఖ్యకు 11,58,342కు చేరిందని అన్నారు. 2021 లెక్కల ప్రకారం ఆదివాసీలు 9 లక్షలకు పైగా ఉండగా, లంబాడాల సంఖ్య 40 లక్షలకు చేరుకుందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓసీ, బీసీ లంబాడాలందరూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోకి చొరబడ్డారని ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేవరకు న్యాయ పోరాటం ఆగదని అన్నారు. ఎస్టీ జాబితా నుంచి బంజారాలను, లంబాడాలను తొలగించాలని హైకోర్టు, సుప్రీంకోర్టులలో కేసులో విచారణలో ఉన్నాయని తెలిపారు. న్యాయపోరాటం చేస్తున్న ఆదివాసీలపై లంబాడాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని ఆరోపించారు. తమ పోరాటానికి అందరూ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, పినపాక, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ, ఆదివాసీ సంఘాల నాయకులు కొర్స వెంకటేశ్వరరావు, పొడియం బాలరాజు, కల్లూరి జయబాబు, మైపతి అరుణ్‌కుమార్, రాంబాబు, పూనెం శ్రీనివాస్, తెల్లం వెంకటేశ్వరరావు, తెల్లం రమణయ్య, ముర్రం వీరభద్రం, ముర్ల రమేష్, కోవా దవలత్ రావు, తెల్లం సీతమ్మ, పూసం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సభా వేదికపై విల్లు ఎక్కు పెడుతున్న నేతలు

శ్రీ చండీదేవిగా పెద్దమ్మతల్లి


శ్రీ చండీదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి అమ్మవారు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం శ్రీ లలితా పరమేశ్వరీదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి భక్తులకు దర్శనమిచ్చారు. చండీహోమం, లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఎండోమెంట్ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోదావరి దోబూచులాట

24 గంటల వ్యవధిలో రెండు సార్లు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ


గోదావరిలో వరద నీటి ప్రవాహం

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల్లో వస్తున్న వరద ప్రవాహంతో గోదావరి పెరుగుతూ, తగ్గుతూ దోబూచులాడుతోంది. 24 గంటల వ్యవధిలో భద్రాచలం వద్ద రెండుసార్లు నీటిమట్టం 43 అడుగులు దాటడంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం ఉదయం 40.80 అడుగులు ఉన్న నీటిమట్టం మధ్యాహ్నం 12 గంటలకు 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ప్రకటించారు. 46.60 అడుగులకు చేరి ఒక్కసారిగా తగ్గుముఖం పట్టి శనివారం రాత్రి 10 గంటలకు 42.90 అడుగులు రావడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. శనివారం ఉదయం వరకు తగ్గిన గోదావరి మధ్యాహ్నం నుంచి మళ్లీ పెరుగుతోంది. మధ్యాహ్నం 3 గంటలకు 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 9 గంటలకు ప్రవాహం 43.80 అడుగులకు చేరింది. రాత్రి 10 గంటలకు స్వల్పంగా తగ్గి 43.70 అడుగులుగా నీటిమట్టం నమోదైంది. గోదావరి తీర ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. భద్రాచలం వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు నదిలో దిగకుండా హెచ్చరిక బోర్డులు, కంచె ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. మరో మూడు అడుగులు పెరిగితే భద్రాచలం నుంచి చర్లతోపాటు ముంపు మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి.

క్లుప్తంగా

కెనడాలో బతుకమ్మ వేడుకలు



మిల్టన్ నగరంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన డాక్టర్ గోళ్ల భూపతిరావు కుమార్తె స్వప్న ఆధ్వర్యంలో కెనడా దేశంలోని మిల్టన్ నగరంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కడ స్థిరపడిన 150 తెలుగు కుటుంబాలు ఓ కమ్యూనిటీ హాల్‌కు చేరుకుని, ఆదివారం బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. తెలుగు వారు ఏదేశంలో ఉన్నా సంస్కృతి సంప్రదాయాలను గౌరవించుకోవడంతో పాటు పాటిస్తారని తెలిపారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు



బడతుకమ్మ ఆడుతున్న మహిళలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో ఆదివారం రాత్రి జిల్లా ఇంటర్మీడియట్, విద్యాశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. చిన్నారులు, మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడి పాడారు. వేడుకల్లో జీఈసీఈఓ అన్నామణి, ములకలపల్లి జీజేసీ ప్రిన్సిపాల్ కల్పన, డీఈఓ, కస్తూర్బా విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేకే-5 ఓసీలో బదిలీలు

ఇల్లెందు: ఇల్లెందు జేకేఓసీలో 50 మందికి పైగా ఉద్యోగులు బదిలీ అయ్యారు. కొంత కాలంగా జేకేఓసీలో బొగ్గు ఉత్పత్తి అడుగంటింది. దీంతో ఇక్కడి ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. తాజాగా 50 మందికి పైగా వివిధ కేడర్లలో ఉన్న ఉద్యోగులను బదిలీ చేయడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 1886లో బొగ్గు తవ్వకాలు ఇక్కడి నుంచి మొదలయ్యాయి. నాటి నుంచి ఇక్కడ 10 వేల మందికి ఆశ్రయం కల్పించిన సింగరేణి తుది దశకు చేరి వందల్లో కార్మికుల సంఖ్య పడిపోయింది. ఇదిలా ఉండగా ఇక్కడి వారందరినీ కేకేఓసీ మందమర్రి ఏరియాకు బదిలీ చేయటంపై ఉద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు.

అక్రమాల అధికారి..?

విద్యుత్ కర్మాగారంలో ఆయన చెప్పిందే వేదం..!

- సారు రూటే సపరేటు
- కమీషన్ల కక్కుర్తితో ప్లాంట్ గౌరవానికి భంగం
- 'సాక్షి'కథనాలతో ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించి, నిర్వహిస్తున్న విద్యుత్ కర్మాగారంలో తవ్వేకొద్ది అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. కమీషన్ల కక్కుర్తితో అవసరం లేని పనులకు రెండింతలు అంచనాలు వేపించడం.. వారి వద్ద నుంచి 15 – 25 శాతం ఓ అధికారి మామూళ్లు వసూలు చేస్తుండటంతో రాష్ట్రస్థాయిలో కీర్తి ప్రతిష్టలు సంపాదించాల్సిన కర్మాగారం పరువు దిగజారుతుండటంపై పలువురు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. ఫైల్ కదలాలన్నా.. కాంట్రాక్ట్ దక్కాలన్నా, ఓపెన్ టెండర్‌లో లొసుగులు లీక్ చేయాలన్నా.. అడిగినంతా ఇచ్చుకోవాల్సిందేనని సమాచారం. అనర్హులకు టెండర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తే అడిగిన టెండర్‌కు పోటీదారులను పెంచి ప్రశ్నించిన వారిని తొక్కేస్తారని బాధితులు చెబుతున్నారు. 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలతో ఇంటెలిజెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, ప్లాంట్‌లో పర్యటించినట్లు తెలిసింది.

అడుగడుగునా ఆరోపణలే..

కర్మాగారంలో అడుగడుగునా అవినీతి రాజ్యమేలుతోంది. తవ్వేకొద్ది అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కంపెనీకి ఫ్లైయాష్ కోసం వచ్చే లారీలకు కంపెనీ స్థలాన్ని పార్కింగ్ స్థలంగా కేటాయించే దగ్గరి నుంచి చిన్నాచితక నామినేటెడ్ కాంట్రాక్టులు కేటాయించే దాకా సారుకు అడిగినంతా ముట్టజెప్పాల్సిందేనని బంధువులు, కుటుంబ సభ్యుల ఖాతాలకు నగదు బదిలీ చేయాల్సిందేనని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. లేదంటే తనకు నచ్చింది చేస్తారని, పాత కాంట్రాక్టర్లు, తన సామాజిక వర్గానికి చెందిన అనుభవం లేనివారికి పనులు అప్పగించేస్తారని ప్లాంట్ వర్గాలు, కార్మికులు, కాంట్రాక్టర్లు గుసగుసలాడుతున్నారు.



కర్మగారం వద్ద ఫ్లైయాష్ ప్లాంట్

- కర్మాగారం నుంచి విడుదలయ్యే ఫ్లైయాష్ తీసుకెళ్లేందుకు మొత్తం 11 కంపెనీలకు అనుమతి ఉండగా, అందులో 7 సిమెంట్ కంపెనీలు, నాలుగు ట్రేడింగ్ కంపెనీలున్నాయి. అయితే రోజూ ప్లాంట్ నుంచి విడుదలయ్యే ఫ్లైయాష్‌లో అధిక శాతం సిమెంట్ కంపెనీలకు కేటాయించాలని నిబంధన ఉంది. కానీ, స్థానికంగా కుదుర్చుకున్న మామూళ్ల ఒప్పందం ప్రకారం నాలుగు ట్రేడింగ్ కంపెనీలకు లారీకి రూ.100 – రూ.150 చొప్పున వాటా ఇచ్చే ఒప్పందంతో వేల టన్నుల లోడింగ్ కల్పిస్తున్నారని తెలుస్తోంది. ప్రతిఫలంగా ఓ అధికారికి ప్రతి నెలా 3వ తేదీన ఠంచనుగా మామూళ్లు ఇవ్వాల్సిందేననే ఆరోపణలున్నాయి.
- ప్లాంట్ ప్రారంభం నుంచి టెండర్ లేకుండా నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో పనిచేసే వర్కర్లను సొంత పనులకు వాడుకుని నామమాత్రపు జీతాలు ఇచ్చి వారి అసలు జీతాలు విత్‌డ్రా చేసుకుంటున్న విషయం బహిరంగ రహస్యమే.
- 2022లో వసూళ్ల దందాపై ఓ కాంట్రాక్టర్ ఎదురుతిరగడంతో అతడిపై అధికారుల అండదండలతో మరో కాంట్రాక్టర్ దాడికి పాల్పడి హత్యాయత్నం చేయడం స్థానిక పీఎస్‌లో కేసు నమోదు లాంటి విషయాలు సంచలనం సృష్టించాయి.
- యాష్ కోసం వచ్చే వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాల్సిన బాధ్యత ప్లాంట్‌పై ఉండగా, సమీపంలోని ఓ స్థలం కేటాయించేందుకు అధికారి రూ.లక్షల్లో లంచం తీసుకుని చక్రం తిప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- చెప్పులరిగేలా తిరుగుతున్న వీటీడీఏ సొసైటీల సభ్యులను కాదని ముడుపులు చెల్లించిన వారికి కట్టబెట్టిన కాంట్రాక్టులపై ఆదివాసీ సంఘాలు బహిరంగంగా ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి బూడిద కేటాయింపుల్లో జరిగిన అక్రమాలను అధికారి బంధువు, కుటుంబ సభ్యుల బ్యాంకు వివరాలపై విచారణ చేపడితే అసలు విషయాలు బయటకొస్తాయని ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాలు పేర్కొంటున్నాయి.

విద్యుత్ సౌధ ఆదేశాల మేరకే

టెండర్ ప్రక్రియ ఉన్నతాధికారుల ఆధీనంలోనిది. ఇక్కడ కేవలం అమలు చేయడమే నా విధి. క్యాంటీన్ టెండర్ మార్పుపై పైఅధికారులకు రాతపూర్వకంగా పంపాం. బూడిద చెరువులో 64 లక్షల టన్నుల బూడిద ఉంది. ఎవరు వచ్చినా కేటాయిస్తాం. వాటిల్లో అక్రమాలు జరిగే అవకాశం లేదు.

– బిచ్చన్న, సీఈ

కొత్త ఫ్యాక్టరీ నిర్మిస్తాం

అశ్వారావుపేటలో మరో ఆయిల్‌పామ్ కర్మాగారం

- సిద్దిపేట ఫ్యాక్టరీలో ట్రయల్ రన్ ప్రారంభించాం
- త్వరలోనే కల్లూరిగూడెం ఫ్యాక్టరీ అందుబాటులోకి
- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి వెల్లడి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏళ్లనాటిది కావడంతో కొన్ని సమస్యలు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఇక్కడ మరో ఫ్యాక్టరీ నిర్మిస్తామని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి తెలిపారు. ఆదివారం దమ్మపేట మండలంలోని అప్పారావుపేట, అశ్వారావుపేట ఫ్యాక్టరీలను, నారంవారిగూడెం నర్సరీని సందర్శించారు. అప్పారావుపేటలో ఉద్యోగులు, సిబ్బంది సమీక్ష జరిపారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీలో బాయిలర్లు, గెలల క్రషింగ్, పవర్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. పనితీరుపై ఆరా తీశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ ఏటా పెరుగుతున్న తోటల విస్తరణ, గెలల దిగుబడి దృష్ట్యా కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అశ్వారావుపేటలో కొత్త ఫ్యాక్టరీకి ఆయిల్‌బోర్డు మీటింగ్‌లో తీర్మానించేలా కృషి చేస్తానని తెలిపారు. ఖమ్మం జిల్లా కల్లూరిగూడెంలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. సిద్దిపేట ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి కాగా, గెలల క్రషింగ్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నామని, త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

కొన్ని గెలలు సిద్దిపేటకు తరలిస్తున్నాం

ఫ్యాక్టరీలో గెలల క్రషింగ్ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఖమ్మం జిల్లాలోని ముదిగొండ, వైరా ప్రాంతాలతోపాటు మహబూబాబాద్ జిల్లాలోని మరికొన్ని మండలాల గెలలను సిద్దిపేట ఫ్యాక్టరీకి మళ్లించామన్నారు. కొత్తగా తోటల విస్తరణకు 10లక్షల మొక్కల్ని సిద్ధం చేశామన్నారు. మరో ఆరు నెలల్లో పొట్టి రకం మొక్కలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. ఆఫ్‌టైప్ మొక్కలతో నష్టం జరిగిన మాట వాస్తవమేనని, రాష్ట్రంలో 40వేల మంది రైతులు తోటలను సాగు చేస్తుంటే, 67 మంది రైతుల తోటల్లో ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఆయిల్‌ఫెడ్‌కు రూ. 60 కోట్ల అప్పు ఉంటే, రూ.600 కోట్లు ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. టన్ను గెలల ధరను రూ.25వేలకు పెరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు.



ట్రాక్టర్‌ను నడుపుతున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్, పక్కన మేనేజర్లు కళ్యాణ్, నాగబాబు

ట్రాక్టర్‌ను నడిపిన ఆయిల్‌ఫెడ్ చైర్మన్

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీలో టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి ఆయిల్‌పామ్ గెలల లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను నడిపి రైతులు, సిబ్బందిని ఉత్సాహపరిచారు. ఆదివారం ఫ్యాక్టరీని సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పామాయిల్ ట్రాక్టర్‌ను చైర్మన్ స్వయంగా నడుపుతూ, కాంటా పెట్టించిన అనంతరం ర్యాంప్ మీదుగా ప్లాట్‌ఫాం పైకి ఎక్కించి, గెలలను అన్‌లోడ్ చేయించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుడు బండి భాస్కర్, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, డివిజనల్ మేనేజర్ రాధాకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్లు కల్యాణ్, నాగబాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం

మణుగూరురూరల్: ఎస్సీ వర్గీకరణలో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాలమహానాడు జాతీయ నాయకులు బి.చెన్నయ్య అన్నారు. ఆదివారం మండలంలోని సమితిసింగారం గ్రామ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన మాలమహానాడు సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్గీకరణలో ఐదుశాతం మాలలకు, తొమ్మిది శాతం మాదిగలకు కేటాయిస్తూ ప్రభుత్వం వర్గీకరణ చేపట్టి మాలల ఉనికే ప్రశ్నార్థకమయ్యేలా వ్యవహరించిందన్నారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును పునఃసమీక్షించి జీఓ-99ను సవరించాలని డిమాండ్ చేశారు. మాలల హక్కులను కాపాడుకునేందుకు నవంబర్ 2వ తేదీన చలో హైదరాబాద్, మాలల రణభేరి మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బూర్గుల వెంకటేశ్వర్లు, పప్పుల జాన్, రంజిత్‌కుమార్, శివకుమార్, నవతన్, బూర్గుల విజయ్‌కుమార్, సుష్మ, మద్దెల భద్రయ్య, వేర్పుల నరేశ్, బూర్గుల సతీశ్, చింతమల్ల రమేశ్, దాసరి వెంకట్, వేర్పుల సురేశ్, బూర్గుల సంజీవరావు, ముల్క నరేశ్, ఏసురత్నం, ప్రసాద్, రవి, బాబీ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చెన్నయ్య

షిరిడీలో బోనకల్ వాసి ఆత్మహత్య

బోనకల్: మండలంలోని రాయన్నపేట గ్రామానికి చెందిన యువ వైద్యుడు మహారాష్ట్రలోని షిరిడీలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రా మానికి చెందిన మరీదు కిశోర్ – కోటేశ్వరి దంపతుల ఏకైక కుమారుడు వినోద్ (30) రష్యా లో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. పెడియాట్రిక్‌లో ఎండీ చేసేందుకు గాను మహారాష్ట్రలోని షిరిడీలో ఓ ప్రైవేట్ వైద్య కళాశాలలో చేరాడు. 6 నెలల్లో కోర్సు పూర్తికానుంది. వైద్య కళాశాలలో కొందరు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురైన వినోద్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

కిన్నెరసాని గేటు ఎత్తివేత



గేటు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలయాశానికి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల వరద రావడంతో ఆదివారం నీటిమట్టం 406.10 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

సందే సందడి

కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 607 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.32,475 ఆదాయం లభించింది. 300 మంది బోటుషికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.18,350 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

9 కి.మీ.. 900 గుంతలు!

- పల్లిపాడు, ఏన్కూరు రోడ్డులో అడుగడుగునా గోతులే..
- నరక ప్రాయంగా మారిన ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కొణిజర్ల: ఉన్నది 9 కిలోమీటర్ల రోడ్డు.. కానీ 900కు పైగా గుంతలున్నాయంటే ఆ రహదారిలో ప్రయాణం ఎలా ఉంటుందో ఊహించుకోండి.. ఈ గుంతల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు పడి పలువురు ప్రయాణికులు గాయపడగా, వాహనాలు ధ్వంసమయ్యాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

పల్లిపాడు టు ఏన్కూరు..

కొణిజర్ల మండలం పల్లిపాడు నుంచి అంజనాపురం, జన్నారం మీదుగా ఏన్కూరు మండల కేంద్రం వరకు 2018లో డబుల్ రోడ్డు నిర్మించారు. ఖమ్మం – భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడేన్ని కలిపేందుకు ఇది దగ్గరి దారి. ప్రస్తుతం ఆ రోడ్డు గుంతలమయం కాగా ప్రయాణం నరక ప్రాయంగా మారింది. పల్లిపాడు నుంచి అంజనాపురం వరకు ప్రతీ రెండడుగులకో గుంత చొప్పున రోడ్డు జల్లెడ మాదిరిగా తయారైంది. ఆ తర్వాత నాలుగు కి.మీ.దూరంలో ఏన్కూరు ఉండగా.. ఆ రోడ్డు పరిస్థితి అధ్వానంగానే ఉంది. వర్షాకాలం కావడంతో గోతుల్లో నీరు నిండగా ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొణిజర్ల మండలం తీగలబంజరకు చెందిన ఓ యువకుడు మూడు నెలల క్రితం గుంతను తప్పించబోయి కిందపడి కోమాలోకి వెళ్లి మూడు రోజుల చికిత్స అనంతరం మృతి చెందాడు. లాలాపురానికి చెందిన ఓ యువకుడు కారులో ప్రయాణిస్తుండగా గుంతలో టైరు దిగబడి రిమ్ము పూర్తిగా ధ్వంసం కాగా రూ.50వేలకు పైగా నష్టపోయినట్లు తెలిపాడు. ఇక లాలాపురం – తీగలబంజర మధ్య పగిడేరుకు వరద వస్తే రోడ్డు కొట్టుకుపోయి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఏటిపై నిర్మించిన చప్టాకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ రోడ్డును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిన ప్రభుత్వం 40 శాతం, ప్రైవేట్ సంస్థలు 60 శాతం వాటా ధనంతో పునః నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అయితే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.



లాలాపురం వద్ద గుంతల మయంగా రోడ్డు



జమ్మికోయ బంజర వద్ద గుంతలు పడిన రహదారి

శిథిలావస్థలో కల్వర్టులు..

2018 లో రోడ్డు నిర్మించినప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టుల నిర్మాణాలపై ప్రతిపాదనలు రూపొందించకపోవడంతో పాత కల్వర్టులపైనే రోడ్డు వేశారు. ప్రస్తుతం ఆ కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పల్లిపాడు సమీపంలో కల్వర్టు కూలగా పైపువేసి మట్టితో పూడ్చారు. లాలాపురం – తీగలబంజర సమీపంలో కల్వర్టులు కుంగి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అంజనాపురం సమీపంలో నిమ్మవాగుపై నిర్మించిన లో లెవల్ చప్టా కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది.

ప్రతిపాదనలు పంపాం

పల్లిపాడు – ఏన్కూరు రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితమే ప్రతిపాదనలు పంపించాం. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు రోడ్డు మరమ్మతు చేయడం సాధ్యం కాదు. ఇప్పటికే రెండుసార్లు మడ్ మిక్స్‌తో గుంతలు పూడ్చి వేయించాం. వర్షాలు తగ్గితే రోడ్డు మరమ్మతు చేయిస్తాం.

– మోదేపల్లి రమేష్, ఆర్‌అండ్‌బీ డీఈ, వైరా

భయపడుతూ ప్రయాణిస్తున్నాం



పల్లిపాడు నుంచి అంజనాపు రం వరకు రోజూ ఆటో తిప్పుతుంటా. ఈ 9 కి.మీ. ప్రయా ణం చేయడానికి గంటకు పైగా పడుతోంది. గుంతల్లో పడి ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి పూట ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే భయపడుతున్నాం. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలి.

– ముత్తనబోయిన లెనిన్, ఆటో డ్రైవర్, తీగలబంజర

బైక్‌కు రూ.10 వేలు ఖర్చయింది



పల్లిపాడు నుంచి సింగరాయపాలెం వరకు రోజూ ద్విచక్రవాహనంపై తిరుగుతుంటా. ఈ క్రమంలో గుంతలో పడి నా బైక్ ధ్వంసమైంది. రిపేర్ చేయిస్తే రూ.10 వేలు ఖర్చయ్యాయి. రోడ్డు గుంతల మయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– షేక్ నాగుల్‌మీరా, సింగరాయపాలెం

ఇసుక లారీలు సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా ఏపీలోని రాజమండ్రి నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ముష్టిబండ శివారులో ఉన్న దాబా పార్కింగ్‌లో మూడు ఇసుక లారీలు ఉన్నాయనే సమాచారం అందటంతో ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి ఆదివారం తెల్లవారుజామున దాడి చేసి, మూడు ఇసుక లారీలను గుర్తించారు. లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని, లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీల్లో ఇసుకను ఏపీలోని రాజమండ్రి నుంచి తెలంగాణలోని నల్లగొండకు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారని, లారీలను సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్ రెడ్డి వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భద్రాచలంటౌన్: భద్రాచలం మీదుగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టణ ఎస్‌ఐ సతీష్ ఆదివారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పట్టణ శివారులోని కొల్లుగూడెం గోదావరి నది నుంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్ పట్టుకున్నారు. తనిఖీ చేయగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

దుమ్ముగూడెం: మండలంలోని బొజ్జికుప్ప గ్రామానికి చెందిన కొమరం రమణ(43) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రమణ ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఎంతకూ వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి పురుగుమందు తాగి పడుకుంది. ఆదివారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు గమనించి ఆమెను భద్రాచలం తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు కొమరం చందు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో గ్రానైట్ కార్మికుడు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని కైకొండాయిగూడెంనకు చెందిన గ్రానైట్ కార్మికుడు గొర్రెపాటి వెంకటేశ్వర్లు (48) ఆర్థిక సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఖమ్మంఅర్బన్ (ఖానాపురంహవేలి) పోలీస్ స్టేషన్లో ఆదివారం కేసు నమోదైంది. సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. గొర్రెపాటి వెంకటేశ్వర్లు గ్రానైట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆర్థికసమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయనఆదివారం ఉదయం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ కుమార్తె వివాహమైంది. మృతుడి సోదరుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దుమ్ముగూడెం: మండలంలోని అడవిరామారం – లచ్చిగూడెం గ్రామాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చిన్నార్లగూడెం కోడివారిగుంపునకు చెందిన కొమరం జగదీశ్ (22) మృతిచెందాడు. జగదీశ్ ఆర్లగూడెం వైపు నుంచి లచ్చిగూడెం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా భద్రాచలం నుంచి ఆర్లగూడెం వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను భద్రాచలం తరలించగా.. శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి రామచిట్టి ఫిర్యాదు మేరకు సీఐ వెంకటప్పయ్య కేసు నమోదు చేశారు.